క్లుప్తంగా

బడిలో తాగు నీటి ఇబ్బందులు



హోటల్ వద్ద తాగునీటి కోసం వచ్చిన విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): తాగునీటి కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత పాఠశాలలో గతంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్ పాడైపోయింది. పలువురు ఇళ్ల నుంచి వాటర్ బాటిల్స్ తెచ్చుకుంటున్నారు. మరికొందరు మధ్యాహ్న భోజనం అనంతరం తూప్రాన్–నర్సాపూర్ ప్రధాన రోడ్డు పక్కన ఉన్న హోటల్స్, స్వీట్ హౌస్ వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఇలా వెళ్లే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరిని తల్లిదండ్రులు, ప్రజలు ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆర్‌ఓ ప్లాంట్‌ను మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని వారు కోరుతున్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శివ్వంపేట(నర్సాపూర్): రత్నపూరి కళాశాల నిర్వహించిన ప్రతిభా టాలెంట్ టెస్ట్‌లో మండల పరిధిలోని చండీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గత నెలలో సైన్స్, గణితంపై నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు పదో తరగతికి చెందిన 10 విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో హనుమంతు, విష్ణు ప్రతిభ చాటారు. గురువారం రత్నపూరి విద్యా సంస్థల ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఇన్‌చార్జి హెచ్‌ఎం దయానంద్‌రెడ్డి, ఉపాధ్యాయులు వామన శర్మ, విజేందర్ రెడ్డి, సంతోష్ కుమార్, హేమలత, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం కూడా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ప్రజలు తమ దరఖాస్తులు నమోదు చేసుకున్నారు. కౌంటర్‌ను ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా పరిశీలించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

సేవాకేంద్రం ప్రారంభం

వెల్దుర్తి(తూప్రాన్): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జగదీశ్వరాచారి మాట్లాడుతూ, ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశానుసారం ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సేవా కేంద్రం నిరంతరం అందుబాటులో ఉంటుందన్నారు. అర్హత గలవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాయంత్రం వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

పెద్దగుట్టలో ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రార్థనలు



దర్గాలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, పార్టీ నాయకులు

నర్సాపూర్: ఎమ్మెల్యే సునీతారెడ్డి గురువారం నిజామాబాద్ జిల్లా పెద్దగుట్ట దర్గా వద్ద ప్రార్థనలు చేశారు. ఆమె వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికలలో ఆమె ఎమ్మెల్యేగా గెలుపొందితే గుట్ట కింది నుంచి పైకి మోకాళ్లపై వస్తానని శివ్వంపేట మండలం గోమారం గ్రామానికి చెందిన నర్సింహ్మారెడ్డి మొక్కుకున్నాడు. గెలుపొందడటంతో గురువారం మొక్కు తీర్చాడు.

పథకాలపై అవగాహన

నర్సాపూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామీణ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి చెప్పారు. గురువారం స్థానికంగా మెదక్ లోక్‌సభ పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులు, కేంద్ర ప్రభుత్వ పథకాల ఎంపిక చేసిన లబ్ధిదారులతో కలిపి ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఆమె మాట్లాడారు. పథకాలపై గ్రామ స్థాయిలో తగిన ప్రచారం లేక ప్రజలకు తెలియడం లేదన్నారు. అనంతరం ప్రజా అభిప్రాయ సేకరణ వాహనాన్ని పలువురు నాయకులతో కలిసి పార్టీ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి లక్ష్మీ నర్సయ్య ప్రారంభించారు. ప్రజల నుంచి అభిప్రాయం సేకరించేందుకు పార్టీ ఈ కార్యక్రమం రూపొందించిందని చెప్పారు. వాహనం గ్రామ గ్రామాన తిరుగుతుందన్నారు. మేనిఫెస్టోలో ఏ పథకాలు కోరుకుంటున్నారో ప్రజలు తమ అభిప్రాయాలను కాగితాలపై రాసి వాహనంలో ఏర్పాటు చేసిన పెట్టెలో వేయాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పెద్ద రమేష్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

హైవేపై అక్రమ కల్లు దుకాణాలు

- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ , హైవే అధికారులు
- తాగిన మైకంలో ప్రమాదాల బారిన వాహనదారులు



గడి పెద్దాపూర్‌–కన్‌సాన్‌పల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారికి ఆనుకుని కల్లు దుకాణం

అల్లాదుర్గం(మెదక్): 161 జాతీయ రహదారిపై ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగి ఎంతో మంది మరణిస్తున్నారు. హైవే పక్కన కల్తీ కల్లు విక్రయాలు నివారించక పోవడమే కారణమని తెలుస్తోంది. నేషనల్ హైవే రోడ్డు పక్కన కల్లు అక్రమ దుకాణాలు యథేచ్ఛగా నడుపుతున్నారు. 161 జాతీయ రహదారి అల్లాదుర్గం నుంచి అందోల్ మండలం కన్‌సాన్‌పల్లి వద్ద రహదారి పక్కనే ఇరు వైపులా ఉన్నాయి. అందులో కల్లు, నీరా.. విక్రయాలు జరుపుతున్నారు. ఉదయం నుంచి చీకటి పడే వరకు విక్రయాలు చేస్తున్నారు. రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు కంపౌండ్ వద్ద ఆగి కల్లు తాగుతున్నారు. మత్తులో డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారిన పడి మృతిచెందుతున్నారు.. కొందరు గాయాల పాలవుతున్నారు. అయితే సంబంధిత అధికారులు మాత్రం మాముళ్ల మత్తులో నిద్రిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా కల్లు అక్రమ దుకాణాలు తొలగించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదాలు నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పోస్టల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

శాఖ మెదక్ సౌత్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కులకర్ణి సందీప్



చెక్కును అందిస్తున్న కులకర్ణి సందీప్

చిన్నశంకరంపేట(మెదక్): తపాలా శాఖ బీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆశాఖ మెదక్ సౌత్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కులకర్ణి సందీప్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోస్టాఫీస్ ఆవరణలో బాధిత కుటుంబసభ్యులకు రూ.10 లక్షల బీమా చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుతున్న సేవలను, బీమా సౌకర్యాలను వివరించారు. కేవలం రూ.755లు చెల్లించినట్లయితే రూ.15 లక్షల ప్రమాద బీమా సౌకర్యం, రూ. లక్ష ఆరోగ్య బీమా కలిపి పొందొచ్చన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలోని భాగిర్తి పల్లి గ్రామానికి చెందిన రెడ్డి సిద్ధి రాములు గతేడాదిపాటు ప్రీమియం చెల్లించాడన్నారు. అతను ప్రమాదవశాత్తు మృతిచెందితే అతని భార్య సురేఖకు రూ.10 లక్షల బీమా చెక్కు అందజేశామన్నారు. ఐపీపీబీ మెదక్ బ్రాంచ్ మేనేజర్ శరత్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డెవలప్‌మెంట్ అధికారి హర్షవర్ధన్, మెయిల్ ఓవర్సీర్లు చంద్రగౌడ్, విజయ్, పోస్ట్ మాస్టర్ వెంకట రమణ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి



నర్సాపూర్: భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రికార్డు ల్లో తక్కువ విస్తీర్ణం నమోదు, కొన్ని సర్వే నంబర్లు నమోదు కాకపోవడం తదితర సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. కాగా అసైన్‌మెంట్ భూములు అమ్మడం, కొనడం చేయొద్దన్నారు. క్రయవిక్రయాలు చేయడం నేరమని, ఎవరైనా కొనుగోలు చేస్తే ప్రభుత్వం స్వాధీ నం చేసుకుంటుందన్నారు. చెరువులు, కుంటల శిఖం భూములు, ప్రభుత్వ, వక్ఫ్, దేవాలయ భూములు ఎవరైనా ఆక్రమిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

20 సేవా కేంద్రాల ఏర్పాటు

అదనపు కలెక్టర్ రమేశ్



సమీక్షలో అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు 20 సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ రమేశ్ తెలిపారు. గురువారం రాత్రి తన చాంబర్‌లో మహాలక్ష్మి గ్యాస్ పథకంపై అధికారులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు ఏవైనా సమస్యలుంటే తెల్లరేషన్, ఆధార్, గ్యాస్ కనెక్షన్ పత్రాలను తీసుకొని సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. మెదక్, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్ మున్సిపాలిటీలతోపాటు మెదక్, హవేళిఘణాపూర్, పాపన్నపేట, కొల్చారం, అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేట, టేక్మాల్, చిలప్‌చెడ్, కౌడిపల్లి, నర్సాపూర్, శివ్వంపేట, వెల్దుర్తి, మనోహరాబాద్, తూప్రాన్, చేగుంట, చిన్నశంకరంపేట, నార్సింగి, నిజాంపేట, రామాయంపేట మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు బ్రహ్మరావు, ఎండీ. సాధిక్ హుస్సేన్, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు పాల్గొన్నారు.

152 మంది గైర్హాజరు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని డీఐఈఓ సత్యనారాయణ తెలిపారు. గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణితం, జంతుశాస్త్రం, చరిత్ర పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. జనరల్, ఒకేషనల్ విభాగాల్లో 4,560 విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4,408 మంది హాజరుకాగా 152 మంది గైర్హాజరైనట్లు వివరించారు. దీంతో విద్యార్థుల హాజరు శాతం 97గా నమోదైంది. జిల్లాలోని తూప్రాన్‌లోని 4 పరీక్షా కేంద్రాలను డీఐఈఓ సత్యనారాయణ సందర్శించగా, మెదక్, కౌడిపల్లి, నర్సాపూర్ కేంద్రాలను జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం పర్యవేక్షించింది.

మహిళలు రాజకీయంగా ఎదగాలి

జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత



ఉద్యోగులను సన్మానిస్తున్న హేమలత

మెదక్ కలెక్టరేట్: మహిళలు సామాజికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే సమాజంలో లింగ వివక్షతను అధిగమించగలమని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత అన్నారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయ మహిళా ఉద్యోగులను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలు ఎక్కువ శాతం ఉద్యోగాలు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిప్యూటీ సీఈఓ రంగాచారి, పర్యవేక్షకులు మల్లేశం, కార్యాలయ మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



లక్ష్మి(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతిచెందింది. ఈ సంఘటన చిన్న శంకరంపేట మండలం అంబాజిపేట రహదారిపై గురువారం ఉదయం చోటుచేసుకుంది. మండలంలోని గజగట్లపల్లి గ్రామానికి చెంది బండారు లక్ష్మి(50) మానసిక పరిస్థితి బాగలేకపోవడంతో కాలినడకన రహదారిపై తిరుగుతోంది. ఈ క్రమంలో అంబాజిపేట రహదారిపై కాలి నడకన వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కేసు ను ఏఎస్‌ఐ లక్ష్మణ్ దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం ప్రకారం.. దేవులపల్లి గ్రామస్తుడు నర్సింహా గౌడ్(38) కౌడిపల్లిలోని ఒక రైస్‌మిల్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. అక్కడే పనిచేసే వెల్మకన్న గ్రామానికి చెందిన వ్యక్తిని మంగళవారం రాత్రి బైక్‌పై ఎక్కించుకుని ఊరిలో దించి వస్తూ మార్గమధ్యలో అదుపు తప్పి రోడ్డు పక్కన పొదల్లోకి వెళ్లి కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం గ్రామస్తులు గమనించి ఆస్పత్రికి తరలించారు. గాంధీలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక మాఫియా దాడి చేసింది: హరీశ్



గాయపడ్డ హరీశ్

రామాయంపేట(మెదక్): ఇసుక మాఫియా దాడిలో తాను గాయపడ్డానని చిన్నశంకరంపేట మండలం జంగరాయికి చెందిన ఎర్రోల్ల హరీశ్ తెలిపారు. ఈనెల 1న గ్రామ శివారులోని వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారం పోలీసులకు ఇచ్చానన్నారు. కొందరు పోలీసులు తన వివరాలు అక్రమార్కులకు ఇవ్వడంతో వారు దాడి చేసి గాయపరిచారన్నారు. దీంతో ఆస్పత్రి పాలయ్యానని అన్నారు. గురువారం రామాయంపేట పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. అయితే ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గర్గుల శ్రీనివాస్ హెచ్చరించారు.

ఆయిల్ పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి



ఆయిల్ పామ్ పంటను పరిశీలిస్తున్న ఏఓ జావీద్

రేగోడ్(మెదక్): ఆయిల్ పామ్ పంట సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని ఏఓ జావీద్ తెలిపారు. మండలంలోని కొండాపూర్ లో గురువారం ఈ పంటను పరిశీలించారు. సాగులో తీసుకోవలసిన చర్యలను వివరించారు. మొక్కల పంపిణీ చేసేందుకు గాను లివింగ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో ఒప్పందం జరిగిందన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ఎస్పీ బాలస్వామి



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఎస్పీ బాలస్వామి

మెదక్/మెదక్ మున్సిపాలిటీ: మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని ఎస్పీ డాక్టర్ బాలస్వామి అన్నారు. గురువారం టీఎన్జీఓ భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. అంతరిక్షంలోకి వెళ్లిన సునీతా విలియమ్స్ నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. అంతకుముందు జిల్లా అదనపు పాలనాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మహిళల సంక్షేమం కోసం అనేక నూతన చట్టాలను అమలు చేస్తుందన్నారు. టీఎన్జీఓ అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. మహిళలు స్వశక్తితోనే మహిళా సాధికారత సాధించగలరని పేర్కొన్నారు. అనంతరం జిల్లా మహిళా అధికారులు, ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంతో పాటు భరోసా సెంటర్‌లో మహిళా సిబ్బందితో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మహిళలందరు కలసికట్టుగా ఉండాలని సూచించారు. ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చదివించాలని పేర్కొన్నారు.

ఏడుపాయలలో భారీ బందోబస్తు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏడుపాయలలో జరిగే మహా జాతరకు భారీ బందోబస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ బాలస్వామి తెలిపారు. గురువారం ఏడుపాయల జాతర బందోబస్తుపై అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. లక్షలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

వారంలో రెండు రోజులు మహిళా క్లినిక్

డీఎంహెచ్‌ఓ చందూనాయక్



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ చందూనాయక్

కౌడిపల్లి(నర్సాపూర్)/పాపన్నపేట(మెదక్): వారానికి రెండు రోజులు మహిళా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ చందూనాయక్ తెలిపారు. గురువారం కౌడిపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. చికిత్స కోసం వచ్చిన రోగులను వైద్యసేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ పీహెచ్‌సీలలో 13 మహిళా క్లినిక్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏడు వేల మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. ఇద్దరికి క్యాన్సర్ నిర్ధారణ కాగా హైదరాబాద్ రెఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాపన్నపేట మండలంలోని నాగసాన్‌పల్లి ఏడుపాయల దేవాలయ పరిసరాలు, లక్ష్మీనగర్ మొదలగు ప్రాంతాల్లో పర్యటించి ఫాగింగ్ చర్యలు నిర్వహించారు. దోమల వ్యాప్తి నివారణకు వరంగల్ జోనల్ ఎంటమాలజీ బృందం సభ్యులు సర్వే నిర్వహించారు.

ప్రలోభాలకు గురి కావొద్దు



తెలంగాణ ఓటరు సంకల్ప పత్రాలను చూపుతున్న విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఓటర్లు డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు గురై విలువైన ఓటును వ్యర్థం చేసుకోవద్దని నోడల్ అధికారి విఠల్ అన్నారు. గురువారం మండల పరిధిలో సోమక్కపేట్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన తెలంగాణ ఓటరు సంకల్ప పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులందరూ తమ తల్లితండ్రులకు ధైర్యంగా ఓటు వేయాలని, ప్రలోభాలకు లోబడి ఓటును అమ్ముకుంటే పిల్లల భవిష్యత్ నాశనమవుతుందని వివరించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత వివరించి, ఎలాంటి పక్షపాతం, భయం లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది భానుకిరణ్, డేవిడ్‌రాజ్, సంగీత, శ్యాంసుందర్, శ్రీకాంత్‌శర్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.

విరాళాలను బహిర్గతం చేయాలి



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: బీజేపీకి వచ్చిన విరాళాలను బహిర్గతం చేయాలని డీసీసీ తాత్కాలిక అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. బీజేపీ మినహా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు 10 వేలకోట్ల రూపాయల విరాళాలు అందాయన్నారు. కార్పొరేట్ సంస్థలను బెదిరించి ఆపార్టీ 30 వేల కోట్ల రూపాయల విరాళాలను తీసుకుందని ఆరోపించారు. ఎస్‌బీఐలో విరాళాలను బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినా ఎందుకు ప్రకటించడం లేదని అడిగారు. కాగా బీజేపీకి చెందిన ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు భావించి నిషేధించిందన్నారు. ధర్నాలో కాంగ్రెస్ నాయకులు రిజ్వాన్, మల్లేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కులను కాపాడాలి



మాట్లాడుతున్న టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

రామాయంపేట(మెదక్): కొన్ని రంగాల్లో ఇంకా మహిళల పట్ల వివక్షత కొనసాగుతోందని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ పేర్కొన్నారు. గురువారం మహిళా సదస్సులో ఆయన మాట్లాడారు. మనం వారి హక్కులను మనం కాపాడాలన్నారు. మన భావజాలంలో మార్పు రావాల్సి ఉందన్నారు. నేటి సమాజంలో వారు అన్ని రంగాల్లో రాణి స్తూ పురుషులకు దీటుగా ముందుకు సాగుతున్నారన్నారు. వాయిస్ ఆఫ్ భారత్ వ్యవస్థాపకురాలు వరలక్ష్మి మాట్లాడుతూ మహిళల రక్షణ విషయంలో సమాజంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐరేని రవీందర్‌గౌడ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా అదనపు కార్యదర్శి మోహన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సిద్ధ రాములు



రామాయంపేట(మెదక్): తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రామాయంపేట మండలం దంతేపల్లికి చెందిన కీసరి సిద్ధ రాములు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రతినిధులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షుడు రాములు మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

తూప్రాన్: భర్తను హత్య చేసిన కేసులో భార్య, కూతురు, అల్లుడిని అరెస్టు చేసినట్లు సీఐ కృష్ణ గురువారం తెలిపారు. ఫిబ్రవరి 12న పట్టణంలోని డబుల్ బెడ్రూంలో నివాసం ఉంటున్న హజిపాషా(44) మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు నమ్మించారు. కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. నిత్యం తాగి వేధిస్తున్న భర్తను ఎలాగైన చంపాలని భార్య నిర్ణయించుకుంది. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న భర్తను భార్య సైదాబేగం, కూతురు మోహక్ బేగం, అల్లుడు చిన్న హజిపాష నైలాన్ తాడుతో మెడకు ఉరివేసి హత్య చేసినట్లు నిందితులు అంగీకరించారని తెలిపారు.

జేసీబీ, ట్రాక్టర్ల స్వాధీనం

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న జేసీబీ, ట్రాక్టర్లను టాస్క్ ఫోర్స్, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి మట్టి తవ్వకాలు జరుపుతున్న జేసీబీని, నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

మినీ స్టేడియానికి భూమి అప్పగింత

నర్సాపూర్: మినీ స్టేడియం నిర్మాణానికి అవసరమైన భూమిని గురువారం అప్పగించారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మండల తహసీల్దార్ కమలాద్రి, జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు తదితరులు పట్టణానికి చెందిన 731 సర్వే నంబరులో భూమిని పరిశీలించారు. అనంతరం స్టేడియం నిర్మాణానికి అశోక్ గౌడ్, కమలాద్రిలు.. జిల్లా యువజన క్రీడల అధికారికి ఏడెకరాల భూమి పత్రాలను అప్పగించారు.

వ్యక్తి అదృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని అల్లీపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల సురేష్ గత నెల 27న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు.. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించ లేదు. దీంతో గురువారం అతడి భార్య భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దీప్తి విద్యాలయం సందర్శన



చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని దీప్తి విద్యాలయంను గురువారం డీఈఓ రాధాకిషన్ సందర్శిచారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షా కేంద్రంగా ఉన్నందున అందులో అన్ని వసతులు కల్పించాలని సూచనలు చేశారు. తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యాయులు స్టీవీనా, నిర్వాహకులు కృపవరం, సీఆర్పీ రమేశ్ తదితరులు ఉన్నారు.

మత్స్యకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని జూకల్ గ్రామ మత్స్యకార నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా బేస్త గంగారం, ఉపాధ్యక్షుడిగా బేస్త రంగయ్యలను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అశోక్, సభ్యులుగా బేస్త రాజు, శివాజీ, బేతయ్య, రాములు, పెంటయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా మత్స్య సహకార శాఖ జూనియర్ ఇన్‌స్పెక్టర్ రామాగౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అనంతరం అధ్యక్షుడు బేస్త గంగారానికి నియామక పత్రాన్ని అందజేశారు.